క్లుప్తంగా

అలరించిన నృత్య ప్రదర్శనలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్ర కీలాద్రి కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన వీఎస్‌ఆర్‌కే కళాక్షేత్రానికి చెందిన పలువురు నృత్యకారులు చేసిన ఆంధ్ర, భరత నాట్య ప్రదర్శనలు భక్తులకు విశేషంగా అలంకరించాయి. చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ నృత్య ప్రదర్శనలో వేదాల జానకీ పర్యవేక్షణలో మృదుల, హరిప్రియ, మెనాలి, లలితారాణి, మాస్టర్ శ్రీవైభవ్‌లు చక్కటి నాట్య ప్రతిభను కనబర్చారు. నృత్య ప్రదర్శన అనంతరం వారికి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు.

శాస్త్రోక్తంగా పూర్ణాహుతి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లోని స్వామి సన్నిధిలో పూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా బుధవారం నిర్వహించారు. ఆలయంలో స్వామి సన్నిధిలో జరుగుతున్న వసంత నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ఉదయం పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను జరిపారు. అందులో భాగంగా బలిహరణలు, కొట్నాల ఉత్సవం, వసంతోత్సవం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి నివేదించిన అన్నప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్ హేమలతాదేవి పర్యవేక్షించారు.

వలివేటి సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలి



విజయవాడ కల్చరల్: సంగీత విద్వాంసుడు ప్రయోక్త వలివేటి వేంకటలక్ష్మీనరసింహం సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. లక్ష్మీనరసింహం 73 జయంతి వేడుకల ముగింపు సందర్భంగా దుర్గాపురంలోని ఘంటసాల కళాశాలలో బుధవారం సంగీత రంగానికి చెందిన దావులూరి వీరభద్రరావుకు వలివేటి వెంకట లక్ష్మీ నరసింహం స్మారక సంగీత సాహిత్యరత్న పురస్కారం, సంక్షిప్త రామాయణగానం, మనసిజ వయోలిన్ కచేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వి.శివరామకృష్ణ మాట్లాడుతూ.. సంగీత సాహిత్యాల మేలికలయిక వీవీఎల్ఎన్‌గా అభివర్ణించారు. ఆయన అధ్యాపకునిగా ఎందరో యువతీ యువకులకు మార్గదర్శకత్వం చేశారన్నారు. నిర్వాహకులు దావులూరి వీరభద్రరావుకు వీవీఎల్ఎన్ స్మారక సంగీత సాహిత్యరత్న పురస్కారం ప్రదానం చేశారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన గోళ్ల నారాయణరావు, డాక్టర్ వెన్నావల్లభరావు, తెలగరెడ్డి సత్యానందం పాల్గొన్నారు. యువ వయోలిన్ కళాకారిణి దావులూరి మరసిజ పలు సంప్రదాయ కీర్తనలను వయోలిన్‌పై పలికించారు.

తల్లీ కుమార్తెలపై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): తల్లీ కుమార్తెలపై దాడి చేసిన నలుగురిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వాగు సెంటర్‌కు చెందిన శివరాత్రి నాగమణి కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంది. నాగమణికి ఇంటి సమీపంలో నివాసం ఉండే సురా పెదబాబుతో స్థల వివాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి పెదబాబు, యేసు, లక్ష్మణరావు, పద్మలు నాగమణి ఇంటిలోకి లోపలికి ప్రవేశించి సామాన్లు ధ్వంసం చేశారు. దీనిపై ప్రశ్నించడంతో నాగమణితో పాటు కుమార్తెపై దాడి చేశారు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గుర్తు తెలియని వాహనం ఢీ కొని యువకుడికి గాయాలైన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కేఎల్‌రావునగర్‌కు చెందిన వీ భాస్కర్(29) మెకానిక్‌గా పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి 10 గంటల సమయంలో భాస్కర్ తన బైక్‌పై వైఎస్సార్ కాలనీ నుంచి పాలప్రాజెక్టు వైపు వస్తుండగా, ఫ్లై ఓవర్‌పై గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో భాస్కర్‌కు గాయాలు కావడంతో 108 వాహనంలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంస్కరణ వాది



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అరుణ్ కుమార్, ఎమ్మెల్యేలు వెలంపల్లి, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గౌతమ్‌రెడ్డి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంస్కరణవాది అని ఎమ్మెల్సీ మొండితోక అరుణ్‌కుమార్, ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఐలాపురం కన్వెన్షన్‌లో వైఎస్సార్ సీపీ నగర ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ 115వ జయంతి కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. తొలుత జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు బూదాల శ్రీను అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. బాబూ జగ్జీవన్ రామ్ కేంద్ర ప్రభుత్వంలో 14 శాఖలు నిర్వర్తించారని, ఆయన చేపట్టిన ప్రతి శాఖకు వన్నె తెచ్చారని కొనియాడారు. దేశంలో అనేక చట్టాలు, సంస్కరణలను తీసుకొచ్చిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. జగ్జీవన్‌రామ్ బాటలోనే నడుస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు నామినేటెడ్ పనులు, పదవుల్లో 50 శాతం కేటాయిస్తూ చట్టం చేసి, పరిపాలనలోనూ భాగస్వాములను చేశారని వివరించారు. స్వాతంత్ర్య భారత దేశంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల కోసం తపన పడిన ముఖ్యమంత్రులు వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని స్పష్టంచేశారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. జవహర్ లాల్ నెహ్రూ, మొరార్జీదేశాయ్ కేబినెట్‌లో బాబూ జగ్జీవన్‌రామ్ పనిచేశారని, స్వాతంత్ర్య సంగ్రామంలోనూ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కంచికచర్ల వద్ద పెత్తందార్ల దాష్టీకానికి బలైన బాధితుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు ఢిల్లీ నుంచి వచ్చారని, అదే ఆయన కార్యదక్షతకు నిదర్శనమని పేర్కొన్నారు. అందరూ చదువు కోవాలన్నదే బాబూజీ సిద్ధాంతమని, దానిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తూ.చ. తప్పక పాటిస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ బాటలో మనం నడవాలన్నారు. చదువుతో పాటు ప్రజలందరికీ మేలు చేసే విధంగా ఉండాలని కోరారు. ఫైబర్ నెట్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి మాట్లాడుతూ.. 28 ఏళ్ల చిరుప్రాయంలోనే జగ్జీవన్‌రామ్ చట్ట సభల్లో అడుగు పెట్టి, కేంద్రంలో తాను నిర్వర్తించిన అనేక శాఖలను ప్రక్షాళన చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర్, విశ్వ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, ఎస్సీ కమిషన్ సభ్యుడు కాలే పుల్లారావు, ఎస్సీ విభాగం నగర అధ్యక్షుడు బూదాల శ్రీను, ఎస్సీ విభాగం నాయకులు మధిర ప్రభాకర్, నెలకుర్తి రమేష్, పొలిమెట్ల శరత్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి



వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి అహర్నిశలు శ్రమించారని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ రాయన భాగ్యలక్ష్మి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ.. జగ్జీవన్‌రామ్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. పాలనలో ఆయా వర్గాలకు చక్కటి అవకాశాలు కల్పించారన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్ పడిగపాటి చైతన్య రెడ్డి, మైలవరపు దుర్గారావు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు బూదాల శ్రీనివాసరావు, నాయకులు జయప్రకాశ్ కెనడి, కనకారావు, విశ్వనాథ రవి, కొండపల్లి బుజ్జి, కామళ్ల జోజి, తోకల శ్యామ్, జోసఫ్, తాండ్ర ఇంద్ర, విజయలక్ష్మి, మధిర ప్రభాకర్, ప్రభు దాస్, కురకుల నాగ, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, కేసరి చిన్నోడు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కి నివాళులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కేఎల్‌రావు పార్కు రోడ్డులోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రాయన నరేంద్ర, డివిజన్ అధ్యక్షుడు వెన్నం రజనీకుమార్, వెంకట్, కరిముల్లా, నాగేశ్వరరావు, బాబీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ సేవలు మరువలేనివి..

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పొలిమెట్ల శరత్‌బాబు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో బుధవారం పూర్ణానందంపేటలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఎస్సీ సెల్ నాయకులు సంగీత్‌బాబు, అనంత్, శివ, మహేష్, నాగరాజు, శ్యామ్ పాల్గొన్నారు.

ప్రైజర్‌పేటలో..

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): ప్రైజర్‌పేటలోని జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద డివిజన్ అధ్యక్షుడు గౌడుపేరు సుధీర్ పాల్గొని నివాళులర్పించారు. సీనియర్ నాయకులు చేపూరి శ్రీనివాసరావు, తంగిరాల ప్రమీల, పల్లెపోగు ప్రసాద్, తంగిరాల కృప, మార్కు, పూనూరి జార్జీ, విల్సన్ పాల్గొన్నారు.

50వ డివిజన్‌లో....

వైఎస్సార్ సీపీ నాయకుడు మేకల మరియదాసు ఆధ్వర్యంలో 50వ డివిజన్ రాఘవరెడ్డిరోడ్డులో నిర్వహించిన జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో డివిజన్ ఇన్‌చార్జి బంకా విజయ పాల్గొని నివాళులర్పించారు. నాయకులు బంకా శివ, చాముండేశ్వరి, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నగర మేయర్ భాగ్యలక్ష్మి, దుర్గగుడి ఈఓ రాంబాబు



పూర్ణానందంపేటలో నివాళులర్పిస్తున్న శరత్‌బాబు తదితరులు



నివాళులర్పిస్తున్న 49వ డివిజన్ నాయకులు

హెచ్‌బీకాలనీలో..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హెచ్ బీ కాలనీ షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భవానీపురం అప్నా బజార్ సెంటర్ వద్ద జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్పొరేటర్లు బాపతి కోటిరెడ్డి, పడిగపాటి చైతన్య రెడ్డి పాల్గొని బాబూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జెట్టి రామారావు, కార్యదర్శి దాసరి బుజ్జి, కోశాధికారి కోన సురేష్, ఉపాధ్యక్షుడు ఎం .విజయరాజు, జాయింట్ సెక్రటరీ పెయ్యల క్రీస్తు దాసు, సంఘ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ముందుకు సాగాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తితో ముందుకు సాగాలని డాక్టర్ అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ పేర్కొన్నారు. గొల్లపూడిలోని అంబేడ్కర్ విద్య అకాడమీ హైస్కూల్‌లో జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. సంఘం ఉపాధ్యక్షుడు ఆర్ గోపాలం, అంబేడ్కర్ నగర్ యూత్, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ



అన్నప్రసాద వితరణను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేటలోని శ్రీ నగరాల సీతారామ స్వామి వారి దేవస్థానంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు అన్నప్రసాద వితరణను ప్రారంభించారు. జనసేన నేత పోతిన మహేష్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు లింగిపిల్లి అప్పారావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు బెవర సూర్యనారాయణ కమిటీ ప్రముఖులు బెవర శ్రీనివాసరావు, పోతిన వెంకటధర్మారావు, పిళ్లా విజయకుమార్, కామందుల నరసింహారావు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చేస్తున్న వీఎంసీ అక్రమ నిర్మూలన దళం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అనుమతి లేకుండా ఎలాంటి కట్టడాలు చేపట్టినా కూల్చేస్తామని వీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒన్‌టౌన్ కెనాల్‌రోడ్డు వినాయక స్వామి గుడి వద్ద అక్రమంగా అదనపు అంతస్తు నిర్మాణం చేపడుతున్నట్లు ఫిర్యాదు రావటంతో తమ సిబ్బంది గుర్తించి స్థానిక బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ గంధం ప్రసాద్ ఆధ్వర్యంలో అక్రమ నిర్మూలన దళం కూల్చి వేశారన్నారు. నగర పాలక సంస్థ నుంచి భవన నిర్మాణ అనుమతులు, ప్లాన్ మంజూరు లేకుండా నిర్మాణం చేపడితే సంబంధిత యజమానులకు జరిమానా విధించటంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

● ఆత్మీయ స్వాగతం

విజయవాడ సత్యనారాయణపురం లలిత కల్యాణ మండపంలో బుధవారం జరిగిన వేద సభకు కంచి పరామచర్య శంకర విజయేంద్ర సరస్వతి స్వామిజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామిజీకి వేద పండితులు ఆత్మీయ స్వాగతం పలికారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



శారదా కళాశాల స్వర్ణోత్సవ లోగో ఆవిష్కరణ



లోగోను ఆవిష్కరిస్తున్న విజయేంద్ర సరస్వతి స్వామిజీ, కళాశాల యాజమాన్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గాంధీనగర్‌లో శారదా కళాశాల స్వర్ణోత్సవ లోగోను కంచి కామకోటి పీఠం 70వ జగద్గురువులు శ్రీ విజయేంద్ర సరస్వతి స్వామిజీ ఆవిష్కరించారు. విజయవాడ నగర పర్యటనకు వచ్చిన ఆయన బుధవారం శారదా కళాశాలను సందర్శించారు. శారదా కళాశాల 50వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా కళాశాల యాజమాన్యం రూపొందించిన స్వర్ణోత్సవాల లోగోను ఆవిష్కరించిన ఆయన తన సందేశాన్ని ఇచ్చారు. 50 ఏళ్ల కళాశాల ప్రస్థానాన్ని యాజమాన్యం కంచి స్వామికి వివరించింది. విజయేంద్ర సరస్వతి స్వామిజీ విద్యార్థులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ కుందా సీతారామశాస్త్రి, కుందా రామనారాయణ, కరస్పాండెంట్ వరప్రసాద్, శారదా డిగ్రీ, జూనియర్, కళాశాలల, స్కూల్ ప్రిన్సిపాల్స్ నాగేశ్వర శర్మ, లుక్కా శ్రీధర్, నరసింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

● వైభవంగా ఆది దంపతుల ఊరేగింపు



చైత్రమాస బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ గంగా పార్వతి(దుర్గ)సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఊరేగింపు బుధవారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్త జనుల కోలాటం, భేతాళ నృత్యాల నడుమ వాహన సేవ ముందుకు సాగింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



యాగశాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజలో పాల్గొన్న డెప్యూటీ మేయర్ శ్రీశైలజ తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): యాగాలు, హోమాలతో లోకం సుభిక్షంగా ఉంటుందని, లోక కళ్యాణార్థం నిర్వహించే యాగాలు, హోమాల్లో పాల్గొనడం పూర్వ జన్మ సుకృతంగా భావిస్తున్నామని పలువురు పేర్కొన్నారు. నైనవరం ఫ్లై ఓవర్ దిగువన శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తిపీఠంలో 27వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సహస్ర చండీయాగం నిమిత్తం యాగశాల నిర్మాణానికి బుధవారం భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి నగర డీసీపీ క్రైమ్ వెంకటరత్నం, నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు రత్నకుమారి పాల్గొన్నారు. అతిథులను పీఠాధిపతి కరుమారి దాసు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం యాగశాల నిర్మాణానికి భూమిపూజ, గణపతి పూజలు నిర్వహించారు. అతిథులు పూజా కార్యక్రమాలను నిర్వహించి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వహకులు పాల్గొన్నారు.

8న శంకర విజయేంద్ర సరస్వతి అనుగ్రహ భాషణం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మొగల్రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 8 తేదీ శనివారం సాయంత్రం 6.30 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారిచే అనుగ్రహ భాషణం జరుగుతోందని ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం అధ్యక్షుడు పాలడుగు లక్ష్మణరావు ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల వారు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు



హోమాలు నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు మురళీధరన్ నంబూద్రి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో కొలువై ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి ఉపాలయంలో స్వామి వారి జయంతిని పురస్కరించుకొని పడి పూజా కార్యక్రమంలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం 108 మంది దంపతులచే 108 హోమ గుండాలలో ప్రత్యేక పంచహోమాలు నిర్వహించారు. హోమాలు నిర్వహించి అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ ప్రధానార్చకులు మురళీధరన్ నంబూద్రి ఆధ్వర్యంలో వైదిక కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి పడిపూజను నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి హేమలతాదేవి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ మాజీ సభ్యుడు పణుకు ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట రామాలయం వద్ద..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అయ్యప్పస్వామి జయంతిని పురస్కరించుకొని విల్లాలి వీరా సేవా సమితి, శ్రీశైలం దేవస్థానం సభ్యుడు గురుమహంతు మహేష్ ఆధ్వర్యంలో కొత్తపేట రామాలయం వద్ద ప్రత్యేక వేడుకలను బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ రాయన భాగ్యలక్ష్మిలు ముఖ్య అతిథులుగా హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, నాయకులు గుగ్గిలం మణికంఠ, అశోక్, సూర్యశంకర్, హరీష్ పాల్గొన్నారు.


అయ్యప్పస్వామికి అభిషేకాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అయ్యప్ప స్వామి వారి పుట్టిన రోజును పురస్కరించుకుని కొత్తపేట ఆంజనేయవాగు సెంటర్‌లో వేం చేసి ఉన్న ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు, పుష్పార్చన నిర్వహించారు. వాగు సెంటర్‌లోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం పంచామృతాలతో అభిషేకాలు జరిపారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ స్వామి వారికి అభిషేకాలు, అర్చన నిర్వహించగా, భక్తుల పుష్పార్చన చేపట్టారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నందిపాటి శ్రీనివాసరావు, ఈఓ రావూరి వెంకటేశ్వరరావు పర్యవేక్షించగా, తడికమల్ల శ్రీనివాసరావు, తమ్మిన శేఖర్, పోతిన పరశురాం, పిళ్లా శివ, చింతాడ వెంకటకుమార్ ప్రసాద వితరణ చేశారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అయ్యప్ప స్వామి పుట్టిన రోజును పురస్కరించుకుని బుధవారం కొత్తపేట ఆంజనేయ వాగు సెంటర్‌లో భక్తులకు భారీగా అన్నప్రసాద వితరణ జరిగింది. మణికంఠ అన్న సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు అత్తులూరి ఆదిలక్ష్మి, మరుపిళ్ల రాజేష్‌లు విచ్చేసి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణను ఎమ్మెల్యే వెలంపల్లి ప్రారంభించారు. రెండు వేల మంది భక్తులకు స్వామి వారి అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమ నిర్వాహకులు దుంబు స్వామి, స్థానిక పెద్దలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.

● పౌర్ణమి వెలుగులో చంద్రుడు



నగరంలో పౌర్ణమి వెలుగులో చంద్రుడు అలరించాడు. మొగల్రాజపురం కొండపై ఉన్న శివలింగం సమీపంలోని చంద్రుడిని బుధవారం రాత్రి సాక్షి కెమేరా 'క్లిక్'మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ